క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు

అంబాజీపేట: తొండవరం వెన్నపువారి కాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు మరమ్మతులను గురువారం చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బురదమయంగా మారి నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో స్థానికులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ రహదారిలో విద్యార్థులు, వృద్ధులు, చిన్నారులు, రైతులు ప్రయాణిస్తుంటారని, తరచూ ప్రమాదాల భారీన పడుతున్నారని వివరించారు. దీంతో సర్పంచ్ స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

మలికిపురం: గ్రామీణ ప్రజల విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ అన్నారు. గురువారం మలికిపురం సబ్‌స్టేషన్ వద్ద జరిగిన విద్యుత్ సమస్యల ఫిర్యాదుల స్వీకరణ సమావేశంలో ఆయనతోపాటు ఎమ్మెల్యే దేవవర ప్రసాద్ కూడా పాల్గొని మాట్లాడారు. ఉచిత సోలార్ సిస్టమ్స్ ఏర్పాటుపై వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీలు సత్యవాణి, మల్లిబాబు, ఏడీఈ రాంబాబు, ఏడీఏ కృష్ణరాజ, ఏఈ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వశిష్ట గోదావరి రేవు బంద్



సఖినేటిపల్లి రేవులో వరద ఉధృతి

సఖినేటిపల్లి: మాధవాయిపాలెం ఫెర్రీగా ప్రభుత్వ గుర్తింపులో ఉన్న సఖినేటిపల్లి, నర్సాపురం వశిష్ట గోదావరి రేవులో గురువారం ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన తరుణంలో వరద నీటి ప్రవాహ ఉధృతిని బట్టి జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలతో స్థానిక అధికారులు పంటు, పడవలపై రాకపోకలను నిలుపుదల చేశారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే రేవు పూర్తిగా నిర్మానుష్యంగా మారింది.

నేడు సామూహిక వ్రతాలు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో పవిత్ర శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. పూజలో పాల్గొనే భక్తులకు ఉచితంగా పూజా సామాగ్రి అందిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా



మామిడికుదురులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మామిడికుదురు: వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్‌ఎస్ రద్దు చేయాలని, మినీలను మెయిన్ వర్కర్లుగా మారుస్తూ జీఓ విడుదల చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులు చేయాలని తదితర డిమాండ్లతో అంగన్వాడీలు గురువారం ధర్నా చేశారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు. హెల్పర్ల ప్రమోషన్లకు గైడ్ లెన్స్ రూపొందించాలని, యాప్‌లు అన్నీ కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో అన్నపూర్ణ, కేవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశం

మామిడికుదురు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 25న అమలాపురంలో పర్యటిస్తారని పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు దుర్గా రామకృష్ణ అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో మాధవ్ మొదటి సారి కోనసీమ జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు. ఈ పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా వైనతేయి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చినబాబు సూచించారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్ష గురువారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, గంగలకుర్రు అగ్రహారం, నందంపూడి, మాచవరం, తొండవరం, వాకలగరవు ప్రాంతాలను అధికారులు పర్యవేక్షించాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహం, వీఆర్వోలు పాల్గొన్నారు.

యాప్‌రే బాప్.!

- నెట్‌వర్క్ లేక అప్‌లోడింగ్ సమస్యలు
- ముఖ గుర్తింపునకు ముప్పతిప్పలు
- తలనొప్పిగా మారిన పాత ఫోన్లు



యాప్‌లో ఎఫ్ఆర్ఎస్ తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్త

అంబాజీపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో అపసోపాలు పడుతున్నారు. పాత ఫోన్లలో ముఖచిత్ర గుర్తింపునకు పడరాని పాట్లు పడుతున్నారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరిగా ముఖ చిత్ర గుర్తింపు చేయాల్సిందే. అలా చేయకుండా ఆహార పదార్థాలను అందించలేరు. యాప్‌లు సరిగ్గా పని చేయకపోవడంతో సకాలంలో ముఖ చిత్ర గుర్తింపు ప్రక్రియ జరగకపోవడంతో ఇటు లబ్ధిదారులు, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 301 అంగన్‌వాడీల్లో 228 మంది, రాజోలు నియోజకవర్గంలోని 228 అంగన్‌వాడీ కేంద్రాల్లో 219 మంది కార్యకర్తలు ఉన్నారు.

ప్రాథమిక విద్యా బోధనకు ఆటంకం

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 12 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నమోదు చేసే రికార్డులు (ఎస్ఎస్ఎస్), ప్రీ స్కూల్ అడ్మిన్ విద్యార్థుల వివరాలు నిత్యం విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వాటితోపాటు పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రిజిస్టర్, విటమిన్-ఎ రికార్డు, రీఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులు నిర్వహించాలి. వీటితో పాటు నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్), ఆయా అంగన్‌వాడీల పరిధిలోని గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టులతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి టెక్ హోమ్ రేషన్ పంపిణీ రికార్డు, స్టాఫ్ అడ్మిషన్ రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. పని ఒత్తిడి వల్ల పిల్లలకు ప్రాథమిక విద్య బోధించేందుకు సమయం సరిపోవట్లేదని కార్యకర్తలు వాపోతున్నారు.

పనిచేయని పాత ఫోన్లు

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన మొబైల్ ఫోన్లు పాతవి కావడంతో నెట్‌వర్క్ కష్టాలు అధికంగా ఉంటున్నాయి. మొబైల్‌లో ర్యామ్ తక్కువగా ఉండటంతో తక్షణం యాప్ స్పందించక తిప్పలు తప్పడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తూ.. పాత మొబైల్ ఫోన్‌లను ఆయా జిల్లా అధికారులకు అందజేశారు.

సాగని పోషకాహార పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు వయసున్న బాలలకు ప్రతి నెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. ఎక్కువ మంది తమకు ఇంటి వద్దకే పోషకాహారం కావాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్)గా మార్చారు. పాలు, కోడి గుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు దఫాలుగా అందిస్తున్నారు. ఇవన్నీ పంపిణీ చేయాలంటే వారందరి పూర్తి వివరాలను పోషణ యాప్ ద్వారా రెండుసార్లు నమోదు చేయాల్సి ఉంది. ప్రభుత్వ కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని కార్యకర్తలు కోరుతున్నారు.

> **5జీ ట్యాబ్‌లు ఇవ్వాలి**
>
> 
>
> అంగన్‌వాడీ కార్యకర్తలకు గతంతో ఇచ్చిన ఫోన్లలో ప్రస్తుత యాప్‌లు పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక పక్క లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్ జరిగితేనే పౌష్టికాహారం ఇవ్వాల్సి ఉంది. యాప్‌లు పనిచేక, పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అధికారులు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలి. దీంతో అంగన్‌వాడీలు మానసికంగా ఇబ్బందులు పడుతున్నాం. కేంద్ర ప్రభుత్వం 2011లో జీతాలు పెంచుతామని చెప్పిందే కానీ, నేటికీ అమలుకు నోచుకోలేదు.
>
> – దుర్గా మహేశ్వరి, సెక్టార్ ప్రతినిధి, అంబాజీపేట.

పెన్షన్ల తొలగింపుపై ఆగ్రహం



గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షన్ల కోతతో కొత్త కుట్రకు తెరలేపిందని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం తొత్తరమూడిలో శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల హామీల్లో 50 ఏళ్ల దాటిన వారికి పెన్షన్ ఇస్తానని మాయ మాటలు చెప్పి చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక కొత్త పెన్షన్ ఇవ్వకుండా ఉన్న పెన్షన్ తీసేయడం మొదలు పెట్టారన్నారు. ఒక్క పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారుగా 150 నుంచి 200 వరకు అర్హత కలిగిన దివ్యాంగుల పెన్షన్ రద్దు చేశారన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులకు పెన్షన్ కోత పై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. యథావిధిగా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తీర గ్రామాలను చుట్టుముట్టిన వరద



అప్పనపల్లిలో నీట మునిగిన ఇటుక బట్టీలు

మామిడికుదురు: వైనతేయి గోదావరి తీరంలోని అప్పనపల్లి, పెదపట్నం, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడి బాడవ పల్లవపాలెం, పాశర్లపూడిలంక శ్రీరామ్‌పేట ప్రాంతాలను గురువారం వరద చుట్టుముట్టింది. శ్రీరామ్‌పేటకు వెళ్లే ప్రధాన రోడ్డు ముంపు బారిన పడింది. అప్పనపల్లి స్నాన ఘట్టం పూర్తిగా ముంపులో చిక్కుకుంది. అప్పనపల్లి కాజ్వేకు రెండు వైపులా భారీగా వరద నీరు చేరింది. ఏ క్షణంలో అయినా కాజ్వే ముంపు బారిన పడే అవకాశం ఉంది. కాజ్వేకు రెండు వైపులా ప్రమాదకర పరిస్థితిని సూచిస్తూ అధికారులు ఎర్ర జెండాలు పాతారు. అదే ప్రాంతంలోని ఇటుక బట్టీలు వరద నీటిలో చిక్కుకున్నాయి. కొబ్బరి తోటలను వరద నీరు ముంచెత్తింది. లంకల్లో సాగు చేసిన కూరగాయల తోటలు, పసుగ్రాసం ముంపు బారిన పడ్డాయి. బీర, బెండ, వంగ, మునగ తదితర పంటలు ముంపునకు గురికావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పసుగ్రాసం వరద నీటిలో చిక్కుకోవడంతో రైతులు పచ్చగడ్డి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వరద మరింత పెరుగుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు.

పొంగి ప్రవహిస్తున్న నదీపాయలు




బూరుగులంక వద్ద వృద్ధురాలిని పడవ దాటిస్తున్న పోలీసు

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు వరద ఉధృతిలో పడవలపై ప్రయాణిస్తున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తోన్న నేపథ్యంలో ఆ గ్రామ ప్రజలు పడవలపై వెళ్తున్నారు. లంకల్లోని వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. లంకలన్నీ వరద నీట మునగడంతో పాడి రైతులు పశువులను ఏటిగట్లపైకి తరలించారు. తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అలమూరు: ధవళేశ్వరం బ్యారేజీ ఎగువకు వరద పోటెత్తుతుంది. దీంతో మండలంలోని లంక ప్రాంతాల వెంబడి గౌతమీ నదికి వరద ఉగ్రరూపం దాల్చుతుంది. దీంతో బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులు అప్రమత్తమయ్యారు. ఏక్షణాన్నైనా వరద సంభవిస్తుందన్న విషయాన్ని గుర్తించిన రైతులు తమ వ్యవసాయ సామాగ్రిని బయటకు తరలిస్తున్నారు. పశువులను రక్షణ ప్రదేశాలకు తీసుకెళుతున్నారు. ఎస్సై నరేష్, ఎంపీడీఓ రాజు నేతృత్వంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖ అధికారులు లంక ప్రాంతాల వెంబడి పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. లంక ప్రాంతాల ప్రజలను వరద నుంచి అన్ని విధాల రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. వరద ఉధృతి మరింత ఎక్కువైతే పునరావాస శిబిరాలు, పడవలను ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

వరదతో మునిగిన కాజ్‌వే



ముక్తేశ్వరంలో మునిగిన శ్మశాన వాటిక

అయినవిల్లి: వరద ఉధృతి పెరగడంతో మండలంలోని ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే రహదారిపైకి నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది. రాత్రికి మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ కాజ్‌వే ద్వారా మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామాలకు రాకపోకలకు సంభిస్తాయని అధికారులు తెలిపారు. అలాగే ముక్తేశ్వరంలోని వృద్ధగౌతమి పాయలో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో శ్మశాన వాటిక మునిగిపోయింది. వరద ఉధృతికి పల్లపు ప్రాంతాల్లో ఉన్న పశువులను రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే కొబ్బరి రాసులు మెరక ప్రాంతాలకు రైతులు తరలిస్తున్నారు. ముక్తేశ్వరం- అయినవిల్లిలంక కాజ్‌వే ప్రజలు దాటేందుకు వీలుగా రెండు పడవలు, ట్రాక్టరును అందుబాటులో ఉంచారు. వరద బాధితుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

అయినవిల్లి: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో ఆర్డీఓ శ్రీకర్, తహసీల్దార్ విద్యాపతి, ఎస్సై హరికోటి శాస్త్రి గురువారం పర్యటించారు. పొట్టిలంక తుపాన్ సెల్టర్‌ను పరిశీలించి అక్కడ ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించారు. వరద బాధితులకు అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండేందుకు వీలుగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వరద బాధితులు ఏ అవసరం వచ్చిన కంట్రోల్ రూమ్ నంబర్‌కు 8143768369 ఫోన్ చేయవచ్చన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆలయ కమిటీల ప్రమాణ స్వీకారం

అలమూరు: మండలంలోని పెనికేరులో ఉన్న శ్రీవేణుగోపాలస్వామి, శ్రీఇష్ట కాంతేశ్వరస్వామి ఆలయాల పాలకవర్గం ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కోన విగ్నేష్, శ్రీఇష్ట కాంతేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా కాంద్రేగుల శ్రీనివాస్‌తో పాటు పలువురు సభ్యులుగా నియమితులయ్యారు. ఆలయ ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, సంగీత సుభాష్, సలాది జయప్రకాష్ నారాయణ, నల్లా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనలో ప్రజలకు కష్టాలు

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



మలికిపురం సభలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు రాక్షస పాలనతో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆరోపించారు. గురువారం మండలంలోని చెన్నడం, పాలగుమ్మి, బి.సావరం, సోంపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామశాఖ అధ్యక్షుడు బయ్యా దుర్గాప్రసాద్, కట్టా శ్రీనివాస్, బొడ్డపల్లి పెద్దిరాజు, జిల్లెళ్ల వినోద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండాలను గొల్లపల్లి ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో విజయవంతంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాలను చేపట్టామన్నారు. గొల్లపల్లి మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమం పూర్తిగా కొరవడిందన్నారు. మహిళలు, అమాయకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. కూటమి ఎమ్మెల్యేలు ఉద్యోగులపై భౌతికదాడులు, అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు తూట్లు పొడిచే కుట్ర జరుగుతుందన్నారు. చంద్రబాబుకు జాలి, దయ, కరుణ లేవని అందుకే అన్యాయంగా దివ్యాంగుల పింఛన్లను పరిశీలన పేరుతో రద్దు చేస్తున్నారన్నారు. రద్దు చేసిన దివ్యాంగ పింఛన్లు వెంటనే పునరుద్ధరించకపోతే ప్రభుత్వంపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, రాష్ట్ర ప్రచార విభాగ అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్, సూర్యబలిజ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరు రాణి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చుల విష్ణుమూర్తి, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లాబత్తుల సతీష్‌బాబు, నాయకులు గుబ్బల మనోహర్, ముద్దాడ సీతామహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం దారుణం

మలికిపురం: ప్రభుత్వ కార్యాలయాల్లో కూటమికి సాయం చేసేవారు ఉంటున్నారని, పనుల కోసం ప్రజలు కార్యాలయాలకి వెళ్లే పరిస్థితులు లేవని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురంలో 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ'లో భాగంగా ఇంటికి వంచన కార్యక్రమం గురువారం జరిగింది. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తాడి వర్మ అధ్యక్షతన జరిగిన సభలో సూర్యారావు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ క్యాడర్ పని తీరు అద్భుతమైనదన్నారు. దేశంలో ఎక్కడా లేని దారుణమైన పాలన ఆంధ్రాలో జరుగుతుందన్నారు. చంద్రబాబు, పవన్ తోడు దొంగలన్నారు. నమ్మించి మోసం చేయడం చంద్రబాబు రక్తంలోనే ఉందన్నారు. వికలాంగుల పింఛన్‌లను దారుణంగా తొలగించారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాలకు సైతం మేలు చేసిన ఏకైక సీఎం జగన్ మాత్రమే అని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, పరిశీలకులు మట్టపర్తి నాగేంద్ర, పాటి శివ కుమార్, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మి, సర్పంచ్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనకాయలంక కాజ్‌వేను పరిశీలించిన జేసీ

పి.గన్నవరం: మండలంలోని చాకలిపాలెం శివారు కనకాయలంక లంక కాజ్‌వేను పశ్చిమగోదావరి జిల్లా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. పడవపై లంకలోకి వెళ్లి అక్కడి ప్రజలతో మాట్లాడి వరదలు తగ్గే వరకూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అన్ని రేవుల్లో బోట్లు ఏర్పాటు చేసి, జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. వరద ప్రభావిత గ్రామాల్లో అన్ని శాఖలను అప్రమత్తం చేశామన్నారు. లంక గ్రామాల్లో మూడు నెలల పాటు అవసరయ్యే రేషన్ సరకులను అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థుల కోసం రెండు రోజులపాటు పాఠశాలలకు సెలవు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

లంకల్లో పర్యటించిన డీఏహెచ్ఓ

కొత్తపేట: గోదావరి వరదల్లో పశునష్టం జరగకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి (డీఏహెచ్ఓ) వెంకట్రావు సూచించారు. గోదావరికి ఉధృతంగా వరదలు వచ్చి లంక ప్రాంతాలను ముంచెత్తుతున్న నేపథ్యంలో ఆయన జిల్లాలోని లంక ప్రాంతాల్లో పర్యటించారు. దానిలో భాగంగా బుధవారం వరద ముంపునకు గురైన వానపల్లి సమీప లంక ప్రాంతాల్లో పర్యటించారు. రైతులకు తగు జాగ్రత్తలు సూచించారు. పచ్చగడ్డి నీట మునగక ముందే కోసి భద్రపరచుకుని పశుగ్రాసంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట వానపల్లి లైవ్ స్టాక్ ఆఫీసర్ మోటూరి రామారావు, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

పీఎం జీవన్ జ్యోతితో భరోసా

కొత్తపేట: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం పేద, మధ్య తరగతి కుటుంబాలకు భరోసానిస్తుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆత్రేయపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. నార్కెడిమిల్లికి చెందిన పాల చంద్రశేఖర్ బ్యాంకులో ప్రీమియం చెల్లించడంతో ఆయన మృతి చెందడంతో రూ.2 లక్షల బీమా మంజూరు చేయించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో తండ్రి సత్యనారాయణకు గురువారం అందజేశారు.

అలసత్వం వద్దు

రాజోలు: ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే పనుల్లో అలసత్వం వహించవద్దని పి.గన్నవరం ఏపీడీ రాంబాబు సూచించారు. గురువారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో రాజోలు, పి.గన్నవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన ఉపాధి హామీ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిలిచిపోయిన పనులు, ఉద్యానవన పనులు, కంపోస్ట్‌పిట్స్, పశువుల షెడ్స్ నిర్మాణం, పూర్తి కావస్తున్న పనులపై సమీక్షించారు. ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, జూనియర్ ఇంజినీర్స్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో అభ్యాసన సామర్థ్యం

రాజోలు: పాఠశాలల్లో నిర్వహిస్తున్న విపాసన ధ్యాన కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యం సాధిస్తారని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. గురువారం శివకోటి గురుకుల పాఠశాలలో విపాసన ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమగ్ర శిక్షా సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో స్వవిద్య లెర్నింగ్ అకాడమీ ద్వారా సాంఘిక, బీసీ సంక్షేమ పాఠశాలల్లో విపాసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

వ్యవసాయంలో మహిళా రైతులదే కీలకపాత్ర

మలికిపురం: వ్యవసాయంలో భవిష్యత్తులో మహిళా రైతులదే కీలకపాత్ర అవుతుందని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూప్‌లో అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఏపీడీ పాల్గొని మాట్లాడుతూ, మహిళా రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా రాబోయే కాలంలో వ్యవసాయ ఉత్పత్తులు చేసుకోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా సబ్సిడీలు, రాయితీలతోపాటుగా రివాల్వింగ్ ఫండ్ కూడా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, ఏపీఎం సయిద్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భవాని, కోశాధికారి కడిమి దివ్య మహిళా రైతు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ పూర్తి



అలమూరులో ఎంపీడీఓను సత్కరిస్తున్న మహిళలు

అలమూరు: గ్రామంలోని స్త్రీశక్తి భవనంలో ఆరు నెలల నుంచి మహిళలకు జరుగుతున్న కుట్టు శిక్షణ గురువారం పూర్తైంది. ఎంపీడీఓ రాజు స్థానిక ఏపీఎం సత్తిబాబుతో కలిసి కుటు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలను కుట్టు శిక్షణలో నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 90 మందికి కుట్టు మిషన్లు, శిక్షణ ధ్రువపత్రాలను త్వరలోనే అందజేస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు. అనంతరం మహిళలు ఎంపీడీఓను సత్కరించారు. కో–ఆర్డినేటర్లు కె.గంగాధర్, పి.కనకదుర్గ, సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు

పని భారం తగ్గించాలి

అంబాజీపేట: అంగన్‌వాడీ కార్యకర్తలకు పెను భారంగా మారిన అధిక శ్రమతో కూడిన పనులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని మండల అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అంగన్వాడీలు మాట్లాడుతూ, 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచలేదన్నారు. అంగన్‌వాడీలతో నిర్వహిస్తున్న యాప్‌లు వినియోగించడానికి ఫోన్‌లు సపోర్టు చేయడం లేదన్నారు. జీతాలు పెంచాలని, మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలన్నారు. గ్రాడ్యూటీ జీవోలు మార్పులు చేయాలని, హెల్పర్ ప్రమోషన్‌లకు గైడెన్స్ మార్పు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

కాలుష్యానికి చరమగీతం పాడుదాం

అంబాజీపేట: నేటి సమాజంలో కాలుష్యానికి ప్రధాన కారణమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి ప్రతి ఒక్కరూ చరమగీతం పాడాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. పుల్లేటికుర్రులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన గురువారం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ, రోజురోజుకీ కాలుష్యం పెరిగిపోతుందని, దీనిని అరికట్టడం అందరి బాధ్యత అన్నారు. హోటల్స్‌లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ పేపరు వల్ల క్యాన్సర్, అనారోగ్యం భారీన పడుతున్నారని వివరించారు. గ్రామంలో ఉన్న హోటల్స్, స్వీట్‌స్టాల్స్, చాట్ బళ్లు, మాంస విక్రయదారులు కిరాణా, ఫ్యాన్సీ షాపుల యజమానులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ వల్ల ప్రభలే రోగాలను వివరించారు. గ్రామంలో శానిటేషన్ చేపట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.లక్ష్మీపతి, ఆరోగ్య సిబ్బంది పి.ఏసుబాబు, ఏపీహెచ్ఏ షైనా, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

అంబాజీపేట: మండలంలోని అంబాజీపేట, గంగలకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకూ విద్యుత సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు గున్నేపల్లి, గంగలకుర్రు పరిధిలోని కె.పెదపూడి, మొసలపల్లి, పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు విద్యుత సరఫరా ఉండదన్నారు. 33కేవీ విద్యుత్ లైన్లు, 11 కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నామన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

రాజోలు: శివకోటి గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ లలితకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 59, 6వ తరగతిలో 20, 7వ తరగతిలో నాలుగు, జూనియర్ ఎంపీసీలో ఆరు, బైపీసీలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంట్రన్స్ పరీక్ష రాయలేని అభ్యర్థులు కూడా నేరుగా కార్యాలయంలో సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. వివరాలకు ఈ నంబర్లను 9701856723, 6303190325 సంప్రదించవచ్చన్నారు.

బోధనా పద్ధతుల పరిశీలన

రాజోలు: ప్రాథమిక పాఠశాలల్లో అవలంబిస్తున్న బోధనా పద్ధతులపై డైట్ అధ్యాపకులు గురువారం రాజోలులోని పలు పాఠశాలలను పరిశీలించారు. రాజోలు కో–ఆపరేటివ్ పాఠశాలను పరిశీలించిన బొమ్మూరు డైట్ అధ్యాపకుడు రామకృష్ణ మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ పద్ధతుల్లో 1, 2వ తరగతుల బోధన, సంసిద్ధత కార్యక్రమాల అమలు, ఆటపాటల ద్వారా విద్యాబోధన అంశాలను ఉపాధ్యాయులతో ఆయన చర్చించారు. ఎంఈఓ ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు ఏసుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

రాజోలు: బాధ్యతగా విధులు నిర్వహిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని పి.గన్నవరం క్లస్టర్ ఏపీడీ రాంబాబు గురువారం అన్నారు. జిల్లా ఉత్తమ ఏపీఓగా అవార్డు అందుకున్న మట్టపర్తి నాగప్రసాద్, జిల్లా ఉత్తమ ప్లాంటేషన్ మేనేజర్‌గా అవార్డు పొందిన మెల్లం త్రినాథ్‌ను ఘనంగా సత్కరించారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, పి.గన్నవరం మండలాలకు ఉపాధి హామీ పథక ఉద్యోగులు నాగప్రసాద్, త్రినాథ్‌ను సత్కరించారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కొత్తపేట: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా మందపల్లి ఉమా మందేశ్వర స్వామి క్షేత్రంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈఓ సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ మండపంలో అర్చకులు, వేదపండితులు మహిళలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తారని తెలిపారు.

ర్యాలి జగన్మోహినీ ఆలయంలో..

ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఆ దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

రావులపాలెం: పట్టణంలోని జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రావులపాలెం సీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి అన్నారు. కళాశాలలో గ్రామానికి చెందిన దాత తిరపారెడ్డి తండ్రి జ్ఞాపకార్థం రూ.1.59 లక్షలతో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయించారు. వీటిని సత్యనారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి, సెక్రెటరీ నరేష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.